సాక్షి కర్నూలు
సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై భద్రాచలానికి చెందిన కొండల రావు వారి కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం పల్లకీ సేవ జరుపుతున్నారు.



నిరంతరం నిఘా

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గడివేముల మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. 8లో▶

న్యూస్‌రీల్

నేడు సాయిప్రసాద్‌రెడ్డి నామినేషన్



ఆదోని టౌన్: వైఎస్సార్ సీపీ ఆదోని నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సోమవారం నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్కేడీ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సాయిప్రసాద్‌రెడ్డి నామినేషన్ వేయనున్నారు.

నేడు కాటసాని నామినేషన్



పాణ్యం/కల్లూరు: వైఎస్సార్‌సీపీ పాణ్యం నియోజకవర్గ అభ్యర్థిగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సోమవారం నామినేషన్‌లు దాఖలు చేయనున్నారు. నామినేషన్ వేసేందుకు కల్లూరులోని ఎమ్మెల్యే స్వగృహం నుంచి ర్యాలీగా బయలు దేరి కలెక్టరేట్‌కు చేరుకుంటారు. జేసీ కార్యాలయంలో ఆర్‌ఓ జేసీ నారపురెడ్డి మౌర్యకు నామినేషన్ పత్రాలు అందించనున్నారు. నామినేషన్ అనంతరం కర్నూలులోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలో హ్యాంగ్ అవుట్ హోటల్ వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా..పాణ్యం నియోజకవర్గం నుంచి కాటసాని రాంభూపాల్‌రెడ్డి తొమ్మిదో సారి నామినేషన్ వేయనుండటం విశేషం. 1985లో ఆయన ఇదే నియోజకవర్గం నుంచి మొదటి సారి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

పోలింగ్ రోజున కార్మికులకు సెలవు

కర్నూలు(అర్బన్): మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో వాణిజ్య సంస్థలు, దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ప్రకటించినట్లు కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ ఎం.బాలునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ సెలవుకు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన యజమానులకు జరిమానాతో పాటు శిక్ష తప్పదన్నారు. అలాగే కార్మికులు పనిచేస్తున్న ఉద్యోగానికి సంబంధించి ప్రమాదం లేదా గణనీయమైన నష్టం కలిగించే పరిస్థితుల్లో సదరు ఓటర్లకు ఈ సెక్షన్ వర్తించదన్నారు.

నేడు పదో తరగతి ఫలితాలు

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్ష ఫలితాలను నేడు(సోమవారం)ఉదయం 11 గంటల సమయంలో విజయవాడలో పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్ ఫలితాలను విడుదల చేయనున్నారు. జిల్లాలో 162 కేంద్రాలలో గత నెల 18 నుంచి 30వ తేది వరకు జరిగిన పరీక్షలకు 489 ఉన్నత పాఠశాలలకు చెందిన 37,801 మంది హాజరయ్యారు. ఇందులో 31,178 మంది రెగ్యులర్, 6,623 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారు. పరీక్షల మూల్యాంకనం ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించారు.

శనగల బసవన్నకు ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి త్రయోదశి సందర్భంగా ఆదివారం పరోక్షసేవగా అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. 44 మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి విశేషపూజను జరిపించుకున్నారు. నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

అతివలకు ఆర్థిక సౌభాగ్యం

- మహిళల జీవితాల్లో సమూల మార్పులు తెచ్చిన జగనన్న ప్రభుత్వం
- టీడీపీ హయాంలో డ్వాక్రా రుణాల మాఫీని తుంగలో తొక్కిన చంద్రబాబు
- ఐదేళ్లలో చెప్పింది చెప్పినట్లు చేసి చూపిన వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం
- జిల్లాలో మహిళా సంక్షేమానికి రూ.7,060 కోట్ల వ్యయం
- 134 రకాల వృత్తుల్లో రాణిస్తున్న తరుణీమణులు
- చంద్రబాబు హయాంలో మహిళల కోసం ఒక్కటంటే ఒక్కపథకం లేదు
- చంద్రబాబును నమ్మి మోసపోం అంటున్న మహిళలు

కర్నూలు(అగ్రికల్చర్): మహిళలను టీడీపీ అధినేత చంద్రబాబు దగా చేస్తే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అతివలకు ఆర్థిక సౌభాగ్యం కల్పించారు. 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి అధికారం చేపట్టిన వెంటనే తూట్లు పొడిచారు. టీడీపీ హయాంలో మహిళల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా అమలు చేసిన పథకం ఒక్కటంటే ఒక్కటీ లేదు. ఐదేళ్ల మహిళల సంక్షేమాన్ని విస్మరించిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పారు. మళ్లీ కూటమి కట్టి సూపర్ సిక్స్ పేరుతో ప్రజల ముందుకు వస్తున్నారు. చంద్రబాబును నమ్మే ప్రసక్తే లేదని మహిళలు తేల్చి చెబుతున్నారు.

మాట తప్పని సీఎం వైఎస్ జగన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. తన ఐదేళ్ల పాలనా కాలంలో మహిళల సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యత ఇచ్చారు. చంద్రబాబు డ్వాక్రా రుణాల హామీకి నీళ్లొదిలితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన ప్రకారం వైఎస్సార్ ఆసరా పేరుతో లింకేజీ రుణాలను 4 విడతల్లో తిరిగి అందజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళల కోసం విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారు. వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాలు, బ్యాంకు లింకేజీ రుణాలు, వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా, జగనన్న తోడు పథకాలను అమలు చేశారు. ఐదేళ్లలో లింకేజీ రుణాలతో పాటు వివిధ పథకాల కింద రూ.7,060 కోట్లు మహిళా వికాసానికి ఖర్చు చేశారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుండటంతో మహిళలు జీవనోపాధులను మెరుగు పర్చుకున్నారు.



మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారు

క'రుణ'చూపిన బ్యాంకులు

మహిళల సంక్షేమానికి వైఎసార్‌సీపీ ప్రభుత్వం అన్ని వైపుల నుంచి ఆర్థిక తోడ్పాటు అందించింది. జిల్లాలో డీఆర్‌డీఏ-వైకేపీ ఆధ్వర్యంలో 34 వేల స్వయంసహాయ సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 3.50 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. 2014-15 నుంచి 2018-19 వరకు మహిళలకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలో చుక్కలు చూపించాయి. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఇటు బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇవ్వడం మొదలు పెట్టాయి. ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతే లక్ష్యంగా వివిధ పథకాలు అమలు చేసింది. ఉన్నతి, స్త్రీనిధి కింద అర్హులైన మహిళలకు రుణ సదుపాయం కల్పించింది. ప్రభుత్వం నుంచి ఆర్థిక ఆసరా లభించడంతో మహిళలు 134 రకాల వృత్తుల్లో రాణిస్తున్నారు.

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు

పొదుపు సంఘాల్లోని 90 శాతం మహిళలు వివిధ వృత్తుల ద్వారా జీవనోపాధులను అభివృద్ధి చేస్తున్నారు. మొదట్లో హాలహర్వి మండలం గూళ్యానికే పరిమితమైన రొట్టెల తయారీ కేంద్రాలు ఇప్పుడు జిల్లా అంతటా విస్తరించాయి. వెల్దుర్తి, గోనెగండ్ల, కోడుమూరు తదితర మండలాల్లో వీటిని ఏర్పాటు చేసుకొని మహిళలు రాణిస్తున్నారు. కొందరు మహిళలు తీపి పదార్థాలు, వివిధ తినుబండరాలు తయారు చేసి షాపులకు సరఫరా చేస్తున్నారు. పసుపు, కారం పొడి మిషన్‌లు ఏర్పాటు చేసుకొని.. వాటిని ప్యాక్ చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. ఊది బత్తీలు తయారు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. పొట్టేళ్లు, పెరటికోళ్ల పెంపకం, పాడి పరిశ్రమలో రాణిస్తున్నారు. వెజిటబుల్ సోలార్ డ్రైయర్లు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పొదుపు సంఘాల్లో దాదాపు 5.85 లక్షల మంది మహిళలు ఉండగా.. నేడు 90 శాతం మహిళలు ఏదో ఒక నైపుణ్యాన్ని పెంచుకొని రాణిస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపించే మహిళ పేరు శ్రీలక్ష్మి. మండల కేంద్రమైన వెల్దుర్తికి చెందిన ఈ మహిళ మహాయోగి లక్ష్మమ్మ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. టీడీపీ హయాంలో జీవనోపాధుల కోసం ఎంతో కష్టపడ్డారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఈ మహిళకు రెండేళ్ల వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా, వసతి దీవెన, విద్యా దీవెన తదితర వాటి కింద ఆర్థిక తోడ్పాటు లభించింది. బ్యాంకు కూడా లింకేజీ రుణం మంజూరు చేసింది. అన్ని వైపుల నుంచి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించడంతో ఈమె వెల్దుర్తిలోని రామళ్లకోట రోడ్డులో రోటీ మేకింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకున్నారు. మిషన్‌తో రొట్టెలు తయారు చేసి హోల్‌సేల్, రిటైల్‌గా అమ్ముతున్నారు. నెలకు సగటున నికరంగా రూ.15,000 నుంచి రూ.20,000 వరకు ఆదాయం వస్తోంది. రొట్టెల తయారీ కేంద్రంతో ఉపాధి మెరుగుపడిందని, చాలా సంతోషంగా ఉన్నామని శ్రీలక్ష్మి తెలిపారు.

ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అందించిన ఆర్థిక సాయం

పథకం	లబ్ధిపొందిన మహిళలు	లబ్ధిపొందిన మొత్తం (రూ.కోట్లలో)
వైఎస్ఆర్ ఆసరా	2,49,976	568.28
వైఎస్ఆర్ చేయూత	1,24,045	905.80
సున్నా వడ్డీ రుణాలు	29,520 (గ్రూపులు)	140.36
బ్యాంక్ లింకేజీ రుణాలు	33,819 (గ్రూపులు)	5,250
వైఎస్ఆర్ బీమా	4578	45.49
జగనన్న తోడు	92739	126.81
కళ్యాణమస్తు, షాదీతోఫా	2952	23.71




విక్రయానికి సిద్ధంగా ఉంచిన రొట్టెలు

రూ.7,060 కోట్ల వ్యయం

గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేసింది. 2019-20 నుంచి ఇప్పటి వరకు డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా మహిళల అభ్యున్నతికి రూ.7,060.45 కోట్లు ఖర్చు చేసింది. వైఎస్ఆర్ ఆసరా, వైఎసార్ చేయూత, వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాలు, జగనన్న తోడు, కల్యాణమస్తు, షాదీతోఫా వంటి పథకాలు క్యాలండర్ ప్రకారం అమలు చేశారు. వైఎస్ఆర్ చేయూత కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 ప్రకారం నాలుగేళ్లలో రూ.905.80 కోట్ల ప్రయోజనం లభించింది. వైఎస్ఆర్ ఆసరా కింద రూ.రూ.568.28 కోట్లు బ్యాంకుల నుంచి తీసుకున్న లింకేజీ రుణాలు మాఫీ అయ్యాయి. మాఫీ చేసిన మొత్తం దళారీలు, రాజకీయ నాయకుల సిఫారస్సులు లేకుండా, కులమతాలకు అతీతంగా మహిళల బ్యాంకు ఖాతాలకు చేరింది. దీంతో బ్యాంకులు పెద్ద ఎత్తున లింకేజీ రుణాలు ఇస్తున్నాయి. 2019 నుంచి ఇప్పటి వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఏటా రూ.1,050 కోట్ల ప్రకారం ఐదేళ్లలో రూ.5,250 కోట్లు లింకేజీ రుణాలు మంజూరు చేశారు. వడ్డీ లేని రుణాల కింద రూ.140 కోట్లు చెల్లించారు. వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా కింద రూ.24 కోట్ల ప్రయోజనం లభించింది. జగనన్న తోడు కింద రూ.126 కోట్లు ప్రయోజనం లభించింది. అన్ని వైపుల నుంచి ఆర్థిక తోడ్పాటు అందడంతో ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు వివిధ వ్యాపారాల్లో రాణిస్తున్నారు.

తొలి అడుగు ...!

- శాసనసభ అభ్యర్థులుగా తొమ్మిది మంది కొత్తవారే
- లోక్‌సభకు ముగ్గురు కొత్త అభ్యర్థులు



కర్నూలు(అర్బన్): ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలైన వైఎస్సార్‌సీపీ, తెలుగుదేశం(కూటమి) నుంచి శాసనసభకు తొమ్మిది మంది, లోక్‌సభకు ముగ్గురు కొత్త అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. శాసనసభకు సంబంధించి కర్నూలు జిల్లాలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులుగా ఏఎండీ ఇంతియాజ్(కర్నూలు), డాక్టర్ ఆదిమూలపు సతీష్(కోడుమూరు), బుట్టా రేణుక(ఎమ్మిగనూరు) బూసినే విరుపాక్షి(ఆలూరు), టీడీపీ అభ్యర్థులుగా బొగ్గుల దస్తగిరి(కోడుమూరు), రాఘవేంద్రరెడ్డి(మంత్రాలయం), బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ పార్థసారథి(ఆదోని) తొలిసారి పోటీ చేస్తున్నారు. అలాగే నంద్యాల జిల్లాలో నందికొట్కూరు అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే ఇరు పార్టీల నుంచి కొత్త వారే పోటీలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా డాక్టర్ ధారా సుధీర్, టీడీపీ అభ్యర్థిగా జయసూర్య పోటీ చేస్తున్నారు. ఇకపోతే కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బీవై రామయ్య, టీడీపీ అభ్యర్థిగా బస్తిపాటి నాగరాజు, నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి టీడీపీఅభ్యర్థిగా బైరెడ్డి శబరి తొలిసారి పార్లమెంట్‌కు పోటీ చేస్తున్నారు. కాగా ఎమ్మిగనూరు శాసనసభ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బుట్టా రేణుక 2014లో కర్నూలు పార్లమెంట్ సభ్యురాలిగా ఎంపికయ్యారు. ఆది నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న డోన్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి 1999లో ఆదోని నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అలాగే కర్నూలు లోక్‌సభ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న బీవై రామయ్య ప్రస్తుతం కర్నూలు నగర మేయర్‌గా ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు 17,485 దరఖాస్తులు



పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలు..

నియోజకవర్గం	ఫామ్-12 (పోలింగ్ అధికారులు)	ఫామ్-12డీ (అత్యవసర సర్వీసు పోస్టు)	ఫామ్-12డీ హోం ఓటింగ్
కర్నూలు	3,009	52	180
కోడుమూరు	2,066	126	315
పత్తికొండ	1,080	76	141
ఆలూరు	800	228	271
ఆదోని	1,433	70	253
ఎమ్మిగనూరు	2,176	228	310
మంత్రాలయం	334	81	122
పాణ్యం	3,677	159	298

కర్నూలు(సెంట్రల్): పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ కోసం జిల్లాలో 17,485 దరఖాస్తులు వచ్చాయి. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫామ్-12 కింద 14,575 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే అత్యవసర సర్వీసు ఉద్యోగాలు చేసే 1890 మంది ఫామ్-12డీ దరఖాస్తులు ఇచ్చారు. 85 ఏళ్ల దాటిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం పొందిన వారు ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగించుకోవడం కోసం ఫామ్-12డీ కింద 1,020 మంది ఆప్షన్ ఇచ్చారు.

మే 5 నుంచి 10వ వరకు పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఈ సారి పోస్టల్ బ్యాలెట్‌ను పోస్టు ద్వారా కాకుండా ఫెసిలిటేషన్ సెంటర్‌లో వివినియోగించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మే 5 నుంచి 10వ తేదీల మధ్య ఫామ్-12 దరఖాస్తులు ఇచ్చిన ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఫామ్-12డి కింద 85 ఏళ్ల దాటిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం ఉన్న వారికి నేరుగా వారి ఇళ్లకే వెళ్లి ఓటు వేయించేందుకు నోడల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మే 2 నుంచి 10వ తేదీ మధ్య హోం ఓటర్ల కోసం రూట్ మ్యాపును రూపొందించుకునే పనిలో పోలింగ్ అధికారులు ఉన్నారు. ఇక అత్యవసర సర్వీసుల్లో ఉన్న ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఫామ్-12డీని మాత్రం పోస్టు ద్వారా స్వీకరించి కౌంటింగ్ రోజున వారి ఓట్లను లెక్కగడతారు.

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు నేడే తుది గడువు

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 5 గంటలతో తుది గడువు ముగుస్తుందని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఆదివారం ఆమె పోస్టల్ బ్యాలెట్ వినియోగింపై రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాలో ఇప్పటి వరకు 17 వేల దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వీరందరికీ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలప్రకారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ, పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలురామలక్ష్మీ, ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు

- ఎన్నికల్లో అధికార పార్టీ క్లీన్‌స్వీప్ చేస్తుంది
- వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు బీఫాంల అందజేత



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు బీఫాం అందజేస్తున్న పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ



బీఫాం అందుకుంటున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆలూరు అభ్యర్థి విరూపాక్షి, కోడుమూరు అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కర్నూలు అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్, పత్తికొండ అభ్యర్థి కంగాటి శ్రీదేవి

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలే స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారని, ఎన్నికల్లో అధికార పార్టీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో అన్ని స్థానాల్లో గెలిచి క్లీన్ స్వీప్ చేస్తుందని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బా రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మతో కలిసి కర్నూలు, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థులు బీవై రామయ్య, పోచా బ్రహ్మానందరెడ్డికి బీఫాంలు అందజేశారు. అలాగే పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కర్నూలు అభ్యర్థి ఇంతియాజ్, కోడుమూరు అభ్యర్థి ఆదిమూలపు సతీష్, ఆలూరు అభ్యర్థి విరూపాక్షి, నందికొట్కూర్ అభ్యర్థి ధార సుధీర్ బీఫాంలు అందుకున్నారు. ఇతర నియోజకవర్గాలకు సంబంధించి వారి కుటుంబ సభ్యులు, పార్టీ నేతలకు బీఫాంలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రీజినల్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ.. ఈ నెల 25న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టో విడుదల చేస్తారన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. టీడీపీ తన మ్యానిఫెస్టోను చెత్తబుట్టలో పడేస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా పవిత్రంగా చూసుకున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ఈనెల 25వ తేదీ లోపు ప్రతి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసుకొని మ్యానిఫెస్టో అంశాన్ని వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రచారంలో స్వచ్ఛందంగా పాల్గొనే ప్రజలకు మ్యానిఫెస్టో బుక్‌లెట్ అందిస్తామన్నారు. సిద్ధం, మేమంతా సిద్ధం సభలకు విశేషమైన స్పందన వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో జగనన్న కోసం మేము సిద్ధం అంటూ ప్రజలు ముందుకు రావడం శుభసూచకమన్నారు. పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి తీసుకుపోవాలన్నారు.

ప్రజా విశ్వాసం లేక జగనన్నపై దాడులు

తెలుగుదేశం పార్టీ ఎప్పుడో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని రామసుబ్బారెడ్డి అన్నారు. జగనన్నను రాజకీయంగా ఎదుర్కొనలేక తెలుగుదేశం మూకలు దాడులకు పాల్పడుతున్నాయన్నారు. పదునైన రాయితో సీఎం వైఎస్ జగన్‌పై దాడి చేయడం వెనుక అంతమొందించే కుట్ర దాగి ఉందన్నారు. జనసేన, బీజేపీలను కలుపుకున్నా తెలుగుదేశం పార్టీకి ఆదరణ లేకపోవడంతో ఆ పార్టీ నేతలు నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. పచ్చ మీడియా సీఎం జగన్‌పై అసత్యవార్తలు రాస్తూ పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. తన చేతుల మీదుగా బీఫాంలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ఇంకా మెరుగ్గా సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకుడు గడ్డం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హజ్ యాత్రికులకు 24న శిక్షణ

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని మెరీడియన్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 24వ తేదీ బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల హజ్ యాత్రికులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జమియత్ ఉలమా జిల్లా కార్యదర్శి హఫీజ్ అబ్దుస్ సమీ అసద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మౌలానా డాక్టర్ ఖాజీ అబ్దుల్ మజీద్ సాహెబ్ హజ్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. యాత్రికులు ముఖ్యమైన అంశాలను నోట్ చేసుకోవడానికి నోటు పుస్తకం, పెన్ను తీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు 90328 75378 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మామిడి రైతులకు నష్టం



ఈదురు గాలులకు నేల రాలిన మామిడి కాయలు

పాణ్యం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలులు, వర్షానికి మామిడి రైతులకు నష్టాన్ని తెచ్చిపెట్టాయి. ఒక్క రోజే కేవలం గంట వ్యవధిలో ఈదురు గాలి బీభత్సం సృష్టించింది. ప్రస్తుతం మంచి కాపుతో చెట్టుపై ఉన్న కాయలను మరో వారం పదిరోజుల్లో కోసే క్రమంలో ప్రకృతి ప్రకోపాలనికి మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రస్తుతం గాలి, వానతో అకాల వర్షాలు కురుస్తున్నాయని, ఇందువల్ల విద్యుత్ పోల్స్ విరిగి పడటం, లైన్‌లు తెగిపడటం జరుగుతోందని.. ఈ సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పెనుగాలుల వల్ల పోల్స్ కూలిపోవడం, విద్యుత్ లైన్‌లు తెగిపోవడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఎవ్వరూ వాటిని తాకరాదని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా ఘటన చోటు చేసుకున్నప్పుడే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం చేరవేయాలన్నారు.

ఎన్నికల వేళ నేడు ఉద్యోగుల సంఘం సమావేశం

కర్నూలు (న్యూటౌన్): ఎన్నికల వేళ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏఆర్ సూర్యనారాయణ కర్నూలులో సోమవారం సమావేశం నిర్వహిస్తుండడం చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య వేదిక పేరుతో రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండగా ఎలాంటి సమావేశాలు నిర్వహించరాదు. నిర్వహించాలంటే జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అనుమతి అవసరం. ఒక వేళ సమావేశాలు నిర్వహించుకున్నా ప్రభుత్వానికి వ్యతిరేకంగా కానీ, అనుకూలంగా కానీ మాట్లాడరాదు. అయితే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లను ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టేందుకే కర్నూలులో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 22న నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవి ఫంక్షన్ హాలులో ఈ సమావేశం జరగనుంది.

అభాగ్యులకు ఆసరా!

- అరుదైన వ్యాధి బాధితులకు పింఛన్
- వ్యాధిని బట్టి నెలకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లింపు
- జిల్లాలో 1,505 మంది లబ్ధిదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న బాధితులు

కర్నూలు(హాస్పిటల్): అరుదైన వ్యాధులతో సతమతమవుతున్న వారి జీవితాలు అగమ్యగోచరం. నిత్యం వారికి వచ్చిన వ్యాధులతో బాధను పంటిబిగువున భరించాల్సిందే తప్ప కష్టాలను తీర్చేవారెవ్వరూ కనుచూపు మేరలో కనిపించలేదు. వ్యాధులతో బాధలను భరిస్తూ కుటుంబసభ్యులకు భారమై గడిపిన రోజులు ఎన్నో ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఎడారిలో నీటి మడుగులా, కష్టాల కడలిలో అమృతభాండంలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనిపించారు. ఐదేళ్ల క్రితం తను పాదయాత్ర చేస్తున్న సమయంలో వీరు ఆయనను కలిసి తమ కష్టాలను ఏకరువు పెట్టారు. వారి కష్టాలను చూసి చలించిపోయిన ప్రజానాయకుడు తాను అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన న్యాయం చేస్తానని మా టిచ్చారు. ఈ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రిగా వారికి రూ.5వేల నుంచి రూ. 10వేల వరకు ప్రత్యేక పింఛన్ ఇచ్చి ఆసరా కల్పించారు.

పేదల కష్టాలను వింటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోతారు. వారిని ఆదుకోవడానికి ఆయన అహర్నిశలు ఆలోచిస్తారు. ఈ మేరకు సరైన నిర్ణయాలు తీసుకుని వారికి న్యాయం చేస్తారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీకి మరిన్ని హంగులు అద్దారు. ఆయన అధికారంలోకి వచ్చాక ఏ ముఖ్యమంత్రి ఇవ్వనట్లు దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన వారికి ఇంటికి పెద్దదిక్కుగా మారి వ్యాధిని బట్టి ప్రతి నెలా రూ.3వేల నుంచి రూ.10వేల దాకా వైఎస్ఆర్ హెల్త్ పింఛన్ అందజేస్తున్నారు.

మెడికల్ బోర్డులో వ్యాధినిర్ధారణ

వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్ పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నియమనిబంధనలు అమలు చేస్తోంది. అందులో భాగంగా బాధితులు ముందుగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మెడికల్ బోర్డును సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఈ మేరకు వారు ఒక నిర్ణీత తేదీలో రావాలని సూచిస్తారు. ఆ రోజున వచ్చిన వారిని పరీక్షించి వ్యాధినిర్ధారణ చేసి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తారు. బాధితులు ఈ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం తదితర వివరాలతో డీఎంహెచ్‌వో కార్యాలయంలోని వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్ విభాగంలో దరఖాస్తు చేయాలి. ఇలా వచ్చిన దరఖాస్తులను అక్కడి ఉద్యోగులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి సెర్ప్‌కు వివరాలు పంపిస్తారు. లబ్ధిదారులు నివాస పరిధిలోని సంబంధిత సచివాలయానికి వెళ్తుంది. సచివాలయాల ద్వారా వలంటీర్లకు పెన్షన్ అందజేస్తారు.

వ్యాధిని బట్టి ఆర్థిక సహాయం

జిల్లాలో వైఎస్ఆర్ హెల్త్ పెన్షన్ పథకం లబ్ధిదారులకు వ్యాధిని బట్టి ప్రభుత్వం పెన్షన్ మొత్తాన్ని అందజేస్తోంది. జిల్లాలో ప్రస్తుతం 9 వ్యాధులకు 1,505 మంది పెన్షన్ అందుకుంటున్నారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులకు రూ.3వేలు, కిడ్నీ బాధితులు(డయాలసిస్ వారికి), గుండె, కిడ్నీ, కాలేయం మార్పిడి చేయించుకున్న వారికి, కండరాల క్షీణత ఉన్న వారికి, వివిధ ప్రమాదాల్లో మంచానికి పరిమితమైన వారికి, పక్షవాతంతో అంగవైకల్యం వచ్చి కుర్చీకే పరిమితమైన వారికి, రెండు కాళ్లకు బోదకాలు ఉన్న వారికి నెలకు రూ.5వేలు, సికిల్‌సెల్, తలసీమియా, హిమోఫీలియా(2శాతంపైబడి) ఉన్న వారికి నెలకు రూ.10వేలు అందజేస్తున్నారు.



బాధిత కుటుంబాలకు ఎంతో ఆసరా

మాది ఆస్పరి మండలం ముతుకూరు గ్రామం. నా మొదటి కూతురు లాస్యశ్రీకి తలసీమియా. దీంతో ఆమె బతికి ఉన్నన్ని రోజులు రక్తం ఎక్కించాల్సి వచ్చింది. నాతోపాటు ఇలాంటి వ్యాధులతో బాధపడే వారికి చాలా మందికి అవగాహన కల్పించడమే గాక ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను వర్తింపజేసేలా చేస్తున్నాం. ఈ తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే తలసీమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా బాధితులకు ప్రతి నెలా రూ.10వేల పింఛన్ ఇస్తున్నారు. ఇది బాధిత కుటుంబాలకు ఎంతో ఆసరాగా మారింది.

–శ్రీకాంత్, కర్నూలు తలసీమియా పీపుల్ వెల్ఫేర్ సొసైటీ ఫౌండర్, ప్రెసిడెంట్

ప్రత్యేక ఆసరా లబ్ధిదారుల వివరాలు

తలసీమియా	135
సికిల్‌సెల్	16
హిమోఫీలియా	72
బోదకాలు	10
పక్షవాతం	490
మస్కులర్ డిస్ట్రోఫి	368
కిడ్నీ వ్యాధులు	73
కుష్టుతో వైకల్యం	282
అవయవ మార్పిడి	59
మొత్తం	1,505

జగన్ మామయ్య వల్లే ఆరోగ్యంగా ఉన్నాం

మేము కర్నూలులోని బుధవారపేటలో నివసిస్తున్నాం. మాకిద్దరికీ పుట్టుకతోనే తలసీమియా వ్యాధి ఉన్నట్లు డాక్టర్లు చెప్పారు. ఈ కారణంగా మాకు ప్రతి నెలా పింఛన్ అందుతోంది. ఆరోగ్యశ్రీలోనే మందులు, రక్తాన్ని ఉచితంగా ఇస్తున్నారు. ఈ కారణంగా మేం ఎంతో ఆరోగ్యంగా ఉన్నాం. ఇలాంటి మంచి పథకాలు అందించిన మనసున్న మారాజు జగన్ మామయ్య. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి అవుతారు.



–అబ్దుల్ రిజ్వాన్, ఆసీఫా బీ, కర్నూలు

జగనన్నే మళ్లీ సీఎం అవుతారు

నేను టైలరింగ్ చేసుకుని జీవనం సాగిస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. నా కూతురు ఉమాదేవికి తలసీమియా ఉంది. ఈ ప్రభుత్వం రాకముందు ఆమెకు రక్తం ఎక్కించేందుకు, చికిత్స చేయించేందుకు ఎంతో కష్టాలు పడ్డాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మా కష్టాలన్నీ తీరిపోయాయి. నా కూతురుకు ప్రతి నెలా రూ.10వేల పింఛన్ ఇస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద మందులు, రక్తం ఉచితంగా ఇస్తున్నారు. ఈ కారణంగా మా పాప ప్రస్తుతం ఆరోగ్యంగా ఉంది.ఇంత మంచి పథకాలు ప్రవేశపెట్టిన జగనే మళ్లీ సీఎం అవుతారు.



–మద్దిలేటి, గూడూరు

తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యం




తల్లి షేక్ షహనాబీ, కుమార్తె జాస్మిన్, కుమారుడు అలీఅహ్మద్ (ఫైల్)

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న వన్నూర్‌వలి భార్య షేక్ షహనాబీ, ఆమె కుమార్తె జాస్మిన్ (9), కుమారుడు అలీ అహ్మద్(7) అదృశ్యమయ్యారని ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. దేవనకొండ మండలానికి చెందిన నూర్‌అహ్మద్ తన కుమార్తె షేక్ హహనాబీని పత్తికొండలోని ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న బేల్దారి వన్నూర్‌వలికి ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్ల నుంచి భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు చోటుచేసుకోవడంతో పిల్లలతో కలిసి ఇంటి నుంచి ఆమె వెళ్లిపోయింది. బంధువులు పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియలేదు. దీంతో షహనాబీ తండ్రి పత్తికొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆదోని రూరల్: మండలంలోని మదిరె క్రాస్–ఎల్ఎల్‌సీ కెనాల్ మధ్యలో మెయిన్ రోడ్డుపై శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని ఇస్వీ ఎస్ఐ శ్రీనివాసులు ఆదివా రం విలేకరులకు తెలిపారు. ఏదో వాహనం బ లంగా ఢీకొట్టి వెళ్లిపోయినట్లు కనిపిస్తుందన్నా రు. మృతుడు ఖాకీ చొక్కా, నల్ల ప్యాంట్ ధరించాడని, ఆచూకీ తెలిసిన వారు తన సెల్ నం. 9121101143కు సమాచారం అందించాలన్నారు.

గరుడ వాహనాధీశా నమోస్తుతే



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి



స్వామివారి గ్రామోత్సవ వాహనాన్ని గ్రామపురవీధుల్లో తిప్పుతున్న భక్తులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి గరుడ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం ముందుగా స్వామివారి మూల విగ్రహానికి, ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, తదితర విశేషపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గ్రామోత్సవ వాహనంపై ఉన్న గరుడ వాహనంపై స్వామి వారిని ఉంచి గ్రామపురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గరుడోత్సవ సేవ రోజు గుండు, చందా ఎత్తే పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి స్వామివారి మెడలోని పూలమాలతో అలంకరించి స్వామివారి దర్శనం కల్పిస్తారు. తద్వారా ఏడాది పొడవునా స్వామి అండదండలతో ఆయుఃఆరోగ్యాలతో జీవిస్తారనేది భక్తుల నమ్మకం. ఈ నమ్మకంతోనే గుండు, చందా ఎత్తేందుకు యువకులు పోటీపడ్డారు.

సమస్యాత్మక గ్రామాలపై నిరంతరం నిఘా



- ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి
- నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

చిందుకూరు గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

గడివేముల: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామాలైన చిందుకూరు, పెసరవాయి గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలు, గడివేముల స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. పోలీసులు ఎప్పుడు ప్రజలకు అండగా ఉంటారని, ప్రజలు ఎటువంటి అపోహలకు గురి కావద్దన్నారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, కుల,మత, వర్గాల మధ్య విద్వేషాలకు విభేదాలకు దారి తీసే విధంగా ప్రసంగాలు చేయరాదన్నారు. గ్రామాల్లో అల్లర్లు , గొడవలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. రౌడీ సీటర్ల కదలికలపై నిఘా ఉంచామన్నారు. ఎస్పీ వెంట నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో ప్రమాదం

- కొండ చరియను ఢీకొట్టిన లారీ
- డ్రైవర్ మృతి, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

మహానంది: నల్లమల్ల ఘాట్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఏలూరుకు చెందిన క్రాంతి ట్రాన్స్‌పోర్టు వాహనం కర్నూలుకు వస్తుండగా నంద్యాల–గిద్దలూరు ఘాట్‌రోడ్డులోని బొగద పాత వంతెన ఎస్ టర్నింగ్ వద్ద బ్రేకులు ఫెయిలవడంతో అదుపు తప్పి కొండ చరియను ఢీకొంది. దీంతో ఏలూరులోని కొత్తగూడెం సెంటర్‌కు చెందిన డ్రైవర్ పెద్దరాజు(39) ప్రాణాలు కాపాడుకునేందుకు కిందకు దూకడంతో కొండచరియ రాళ్లు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. లారీలోనే ఉన్న క్లీనర్ వెంకటేశ్వరరావు సైతం గాయపడగా ఇద్దరినీ రోడ్ సేఫ్టీ కానిస్టేబుల్ రసూల్ 108 ద్వారా చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక డ్రైవర్ పెద్దరాజు మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



కొండ చరియను ఢీకొన్న లారీ



మృతి చెందిన డ్రైవర్ పెద్దరాజు

శ్రీ విజయదుర్గ హాస్పిటల్ ప్రారంభం



హాస్పిటల్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న డాక్టర్ బాలమద్దయ్య, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఆదివారం శ్రీ విజయదుర్గ హాస్పిటల్ ప్రారంభమైంది. హాస్పిటల్‌ను శ్రీ దుర్గా ఆటోమోటివ్స్ ప్రొప్రైటర్ సుధా మల్లికార్జునరావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఏపీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జి. బాలమద్దయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగేశయ్య మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా కర్నూలు నగరంలో ఆర్థోపెడిక్ వైద్యసేవలు అందించామని, ఇప్పుడు గాయత్రి ఎస్టేట్‌లో శ్రీ విజయదుర్గ హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్‌తో పాటు మల్టీస్పెషాలిటీ వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు అందరికీ అందుబాటులో ఉండే విధంగా సేవలు అందిస్తామని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక టెక్నాలజీ పరికరా లు,నిష్ణాతులైన వైద్యులతో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, శ్రీ విజయదుర్గ కార్డియాక్ సెంటర్ అధినేత డాక్టర్ ఎ. వసంతకుమార్, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్వీ రా మమోహన్‌రెడ్డి, డాక్టర్ రామచంద్రనాయుడు, డాక్టర్ తిరుమలాచారి, డాక్టర్ పి. శ్రీనివాసులు, డాక్టర్ రంగనాథ్, డాక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రచార వాహనం సీజ్

- పార్టీ జెండాలు, టోపీలు, టీ షర్టులు స్వాధీనం



పోలీసు స్టేషన్‌లో ప్రచార వాహనం

చాగలమర్రి: అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్‌పార్టీకి చెందిన ప్రచార వాహనాన్ని చాగలమర్రి టోల్ ప్లాజా వద్ద ఆదివారం స్టాటిక్ సర్వేలెన్స్ టీం–3 ఇన్‌చార్జ్ గురుమూర్తి తనిఖీ చేసి సీజ్. ప్రచార రథంలో ఉన్న జెండాలు, టోపీలు, టీ షర్ట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రచార రథం వైఎస్సార్ జిల్లా నుంచి నంద్యాలకు వెళుతుండగా సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రమణయ్య తెలిపారు.

మీకు తెలుసా?

డిపాజిట్ గల్లంతు అంటే..

ఏ ఎన్నికల్లోనైనా పోటీ చేసిన అభ్యర్థి డిపాజిట్ గల్లంతయిందనే మాటలు వినడం సర్వసాధారణం. డిపాజిట్ కోల్పోడం అంటే దారుణంగా ఓడిపోవడమే. ఇండిపెండెంటు అభ్యర్థులుగా పోటీ చేసే వారిలో 96 శాతం మంది డిపాజిట్ కోల్పోవడం చూస్తుంటాం. ఇంతకీ డిపాజిట్ కోల్పోవడం అంటే ఏమిటి... డిపాజిట్ దక్కించుకోవాలంటే ఎన్ని ఓట్లు రావాలి? అనే విషయాలు తెలుసుకోవడంపై ఓ టర్ల ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. పార్లమెంటుకు లేదా అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తారు. ప్రస్తుత ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం పార్లమెంట్‌కు పోటీ అభ్యర్థులు అయితే జనరల్, బీసీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.12,500 చెల్లిస్తారు. అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థులు అయితే జనరల్, బీసీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు అయితే రూ.5 వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లిస్తారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మేరకు ఓట్లు పొందితే డిపాజిట్ వెనక్కి ఇస్తారు. లేకపోతే డిపాజిట్‌ను అభ్యర్థులకు ఇవ్వరు. దీనినే డిపాజిట్ గల్లంతు అయిందని అనడం ఆనవాయితీ. చెల్లుబాటు అయిన ఓట్లలో 1/6 పొందితే డిపాజిట్ దక్కించుకున్నట్లు అవుతుంది. 1/6 ఓట్లు పొందలేకపోతే డిపాజిట్ కోల్పోయారు అంటారు. ఈవీఎంల ద్వా రా ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్నందున నోటాకు పోల్ అయిన ఓట్లను మినహాయించి మిగిలిన వాటిని చెల్లుబాటు అయిన ఓట్లుగా పరిగణిస్తారు. ఉదాహరణకు ఒక ఎన్నికల్లో లక్ష ఓట్లు చెల్లుబాటు అయినపుడు 1/6 వ వంతు అంటే 16,667 ఓట్లు వస్తే డిపాజిట్ దక్కినట్లు పరిగణిస్తారు. ఇంతకంటే తక్కువ ఓట్లు వస్తే డిపాజిట్ కోల్పోయినట్లు లెక్క.

– కర్నూలు(సెంట్రల్)

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించాలి




శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రాఘవేంద్ర

కర్నూలు(అగ్రికల్చర్): రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ప్రోత్సహించాలని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సెమినార్ హాల్‌లో దేశీ డిప్లమా కోర్సుపై ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ఉత్పత్తి ఆధారిత సంఘాలుగా కూడా ఏర్పాటు కావచ్చని, సంఘాలుగా ఏర్పడటం వల్ల కలిగే ఉపయోగాలపై ఇన్‌పుట్ డీలర్లు అవగాహన పెంచుకొని రైతులకు వివరించాలని సూచించారు. సంఘాలకు నాబార్డు నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుందన్నారు. ఉద్యాన శాఖ కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు రాయితీలు ఇస్తుందన్నారు. మార్కెట్‌లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేనప్పుడు రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా పంట ఉత్పత్తులను సేకరించి ధర బాగా ఉన్న ప్రాంతాలకు తీసుకెళ్లి అమ్ముకోవచ్చన్నారు. దేశీ శిక్షణ కార్యక్రమం సమన్వయ కర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర మాట్లాడుతూ నేడు రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్రాధాన్యత పెరిగిందని, ఇప్పటికే జిల్లాలో అనేక సంఘాలు ఏర్పాటయ్యాయని తెలిపారు. అయితే ఇంకా పంటల వారీగా రైతులు సంఘాలుగా ఏర్పాటు కావడం ద్వారా పండించిన పంటలకు గిట్టుబాటు ధర పొందవచ్చని సూచించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

- ఐరన్‌బండలో విషాదం



మృతిచెందిన గొల్ల హరి

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామానికి చెందిన గొల్ల హరి(14) అనే విద్యార్థి విద్యుత్ షాక్ తగిలి ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల సోమన్న, గొల్ల భాగ్యలక్ష్మి కి ఇద్దరులు కుమారులుఉన్నారు. ఒక ఎకరా పొలం ఉండగా...వ్యవసాయ పనులతో పాటు సోమన్న గొర్రెల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమారుడు హరి గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. తండ్రి ఆదివారం ఉదయం ఎమ్మిగనూరులో జరిగే సంతకు వెళ్లాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో హరి ఉదయం తమ పొలంలో సాగుచేసిన వేరుశనగ పంటకు నీళ్లు కట్టేందుకు వెళ్లాడు. పొలంలో మోటారుకు ఉన్న కరెంట్ వైర్‌ను కడింగ్ బ్లేడ్‌తో సరిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై హరి అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం వెళ్లిన కుమారుడు మధ్యాహ్నం అయినా ఇంటికి రాకపోవడంతో తండ్రి సోమన్న మధ్యాహ్నం పొలానికి వెళ్లి చూశాడు. విద్యుత్ మోటార్ సమీపంలో కిందపడి హరి మృతిచెంది ఉండటాన్ని గమనించాడు. విషయం తెలుసుకున్న బంధువులు పొలానికి వెళ్లి హరి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

■ కర్నూలు N.R. పేట, పాత సెయింట్ జోసఫ్ స్కూల్ ఎదురుగా సౌత్–ఈస్ట్ ఫేస్, 2.8 సెంట్ల 3 ఫ్లోర్స్, 2 షాప్స్ గల కార్నర్ బిల్డింగ్ అమ్మబడును. 30 ఫీట్ రోడ్, 33x32 సైజు. సంప్ర: 78427 16360, 96767 33138 [L-794397]

SERVICES

బంగారం కొనబడును

■ మీ పాత బంగారాన్ని కొనబడును. & తాకట్టులో గాని, బ్యాంకులో గాని ఉన్న బంగారాన్ని విడిపించి మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర: 94949 41678. [L-429]

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6467]

WANTED

■ రాయలసీమ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో పని చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qly: ఇంటర్/ డిగ్రీ, వ: 35 సం॥లోపు. జీతం: Upto 14,000/- సెంట్రల్ ప్లాజా, కర్నూలు. 90107 42455 [L-794395]

■ అధిక ఆదాయం, పెట్టుబడి లేదు, అమ్మకాలు కావు, Weekly&Monthly (Lifetime) ఆదాయం, పార్ట్ టైం & ఫుల్ టైం Age;18+ కాల్ or వాట్సాప్. 91820 78790, 83099 49116. [L-800567]

■ హాస్పిటల్ నందు పనిచేయుటకు ANM/GNM OT సిస్టర్స్ మెడికల్ షాప్ కొరకు ఫార్మాసిస్ట్, ICU టెక్నీషియన్, హౌస్ కీపింగ్ కావలెను. సంప్ర: 93478 00828. [L-800571]

■ ఫుల్ టైం, పార్ట్ టైం జాబ్ కోసం ఎదురు చూస్తున్నారా.. అయితే వెంటనే AP TS NEWS APP డౌన్‌లోడ్ చేసుకోండి. మీకు నచ్చిన జాబ్ ఎంచుకోండి. సెల్: 99666 76646. [L-800566]

■ ప్యాపిలిలోని ప్రముఖ వెంచర్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డులు కావలెను. డ్యూటీ: 12గంటలు, జీతం: 12,000+ESI, PF, చదువు: 10th. సం.ప్ర: 7287917477, 9182964173. [L-800580]

■ బనగానపల్లె, కోవెలకుంట్లలో గల IIFL గోల్డ్ లోన్ బ్రాంచ్‌లలో పగలు డ్యూటీ చేయుటకు స్థానికులైన సెక్యూరిటీ గార్డ్‌లు కావలెను. జీతము, ESI, PF సౌకర్యం కలదు. వివరాలకు సెల్: 949403299. [L-800579]

■ 10th క్లాస్ ఫెయిలైన విద్యార్థులకు అన్ని Subjectలలో కోచింగ్ ఇవ్వబడును. సంప్రదించండి. Dolphin e-Kidz school, N.R.Peta, Kurnool. Cell: 6281104202, 9493902958. [L-800577]

■ కర్నూలు నగరంలోని ప్రముఖ కాలేజీలో లెక్చరర్‌గా బోధించుటకు M.Sc Micro Biology or M.Sc Bio Chemistry పూర్తి చేసిన స్త్రీ అభ్యర్థులు కావలెను. సెల్: 73309 24873, 98854 85281. [L-800578]

■ ప్రముఖ షాపింగ్‌మాల్స్ సినిమా థియేటర్స్, హాస్పిటల్ నందు వర్క్ చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ స్టాఫ్ & రూం బాయ్స్ కావలెను. సంప్ర: 95733 71377, 63090 10779, 93812 84920 [L-794394]

■ Wanted qualified and well experienced teachers to teach all subjects for Pre Primary, Primary and Higher Classes. St Lourdes EM School. Cell: 94939 02958. [L-800563]

■ Wanted Sales Consultant for Kun Hyundai Car Show Room. Auto Nagar, Kurnool. Kurnool, Nandyal & Adoni. Contact: Subbu- 91601 14474, 91333 14336 [L-800573]

■ కిసాన్ సర్వే ఫీల్డ్ వర్క్ చేయుటకు జిల్లా వ్యాప్తంగా ఎంప్లాయిస్ కావలెను. Q: 10th / ఇంటర్. జీతం : 18వేలు + 2వేలు TA, DA. సెల్ : 90325 46599. [A-1225]

■ మీ గ్రామం / పట్టణంలోనే ఉంటూ అదనపు ఆదాయం కొరకు కొద్దిపాటి పెట్టుబడి పెట్టగలిగి పార్ట్ టైం మార్కెటింగ్ చేయగలవారు సంప్రదించండి. R.V.మార్కెటింగ్ ఏజెన్సీస్, Hyd. 72 888 555 69. [G-672921]

■ ఎం.జి. బ్రదర్స్ కియాలో (అనంతపురం / కర్నూలు) సేల్స్ ఎగ్జిక్యూటివ్ గా పని చేయుటకు కావలెను. కనీసం డిగ్రీ చదివి ఉండాలి. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాలకు సం.ప్ర: 8333929186. [A-1961]

■ పప్పులేవ్వీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000 - 40,000, ఫ్రీ రూమ్+భోజనం, Hyd. Ph: 9014885406 [HA-47]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073. [HA-51]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165